పథకాల చుట్టే ప్రచారం !

- ఇంటింటికీ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు
- ఓవైపు ఆరు గ్యారంటీలు ప్రకటించిన కాంగ్రెస్
- మరో వైపు అమలుచేస్తున్న పథకాలతో బీఆర్ఎస్



వైరారూరల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో వైరా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రతీ ఎన్నికల మాదిరిగానే పార్టీల నాయకులు మేనిఫెస్టోలు ప్రకటించాయి. అధికారంలోకి తాము వస్తే చేపట్టనున్న పనులతో పాటు గతంలో చేసిన అభివృద్ధి వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ ఆయా పార్టీ శ్రేణులు చేరవేస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకులు ఈ పదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రధానంగా వివరిస్తున్నారు. అంతేకాకుండా మళ్లీ అధికారంలోకి వస్తే ఈ పథకాలను కొనసాగించడమే కాక కొత్తగా అమలుచేసే పథకాలను చెబుతున్నారు. మరోపక్క కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రధానంగా ప్రచారంలో ప్రస్తావిస్తోంది. అభ్యర్థులు తమ ప్రచార సభల్లో వీటినే వివరిస్తుండగా.. నాయకులు కూడా ఇంటింటి ప్రచారంలో ఆరు గ్యారంటీలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పోలింగ్‌కు తక్కువ సమయం ఉండడంతో ఓ పక్క అగ్రనేతల.. ఇంకో పక్క అభ్యర్థులు.. మరో పక్క పార్టీ శ్రేణుల ప్రచారంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

హస్తం.. ఆరు

కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను ఇటీవల వెల్లడించారు. వీటిని ఆరు గ్యారంటీలుగా చెప్పడంతో పాటు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలుచేస్తామని ప్రచారంలో చెబుతున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతీ మహిళకు నెలనెలా రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి జ్యోతి 200 యూనిట్ల ఉచిత కరెంట్ , రైతు భరోసా కింద రైతు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు తదితర పథకాలు వారి గ్యారంటీల్లో ఉన్నాయి. వీటితో ముద్రించిన కరపత్రాలను నాయకులు ఇంటింటా పంపిణీ చేస్తూ... ప్రచారంలో నిమగ్నమయ్యారు.

బీఆర్ఎస్ పథకాల హోరు

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు దీటుగా బీఆర్ఎస్ తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే అమలుచేస్తున్న పథకాలను కొనసాగింపుగా వీటిని ప్రకటించారు. వృద్ధాప్య, వితంతు, బీడీ, గీత కార్మికులకు పింఛన్‌ను విడతల వారీగా రూ.5,016కు పెంచడమే కాకుండా రైతు బంధు రూ.10 వేల నుంచి రూ.16 వేలు పెంచుతామని చెబుతున్నారు. అలాగే, రూ.400కే గ్యాస్ సిలిండర్, సొంత ఇంటి నిర్మాణం, పేద మహిళకు జీవన భృతి కింద నెలకు రూ.3వేలు, దళితబంధు, గృహలక్ష్మి, రుణమాఫీ పథకాలు అమలుచేయనున్నట్లు వివరిస్తున్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే బీసీ, గిరిజన బంధు వంటి పథకాలను ప్రవేశపెడతామని మేనిఫెస్టోలో ప్రకటించారు.

కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు..


వేంసూరు : సండ్రతో కరచాలనం చేస్తున్న యువతి


సత్తుపల్లి : మాట్లాడుతున్న వెంకటవీరయ్య సతీమణి మహాలక్ష్మి

ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు: కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని.. ఎప్పటికైనా రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్షగా నిలుస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ బండి పార్థసారధిరెడ్డితో కలిసి గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ ఆరు గ్యారంటీ స్కీమ్‌ల పేరిట కాంగ్రెస్ నాయకులు మభ్య పెడుతున్నారని ఆరోపించారు. ఎంపీ పార్థసారధిరెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే వెంకటవీరయ్య గెలిపించడం ద్వారా కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, నాయకులు పాల వెంకటరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, దమోదర్‌రెడ్డి, మంపాటి సత్యనారాయణరెడ్డి, దొడ్డ వెంకటకృష్ణరెడ్డి, గండ్ర సోమిరెడ్డి, పుచ్చాకాయల శంకర్‌రెడ్డి, మందపాటి శ్రీలక్ష్మీ, మందపాటి వెంకటరెడ్డి ,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మీలో ఒకరిగా పనిచేశారు...

సత్తుపల్లి: ప్రజల్లో ఒకరిగా కలిసిపోయి కష్టసుఖాల్లో పాలు పంచుకున్న సండ్ర వెంకటవీరయ్య అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని ఆయన సతీమణి మహాలక్ష్మి అన్నారు. సత్తుపల్లి పట్టణంలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేసిన ఆమె కౌన్సిలర్ అద్దంకి అనిల్ కుమార్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు.కొండూరు రత్నకుమారి, కౌన్సిలర్లు అమరవపు విజయనిర్మల, మేకల భవాని, వీరపనేని రాధిక, బాబీ, చల్లగుళ్ల కృష్ణయ్య, పవన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

కల్లూరు/కల్లూరు రూరల్/తల్లాడ: కల్లూరు పట్టణంలో సండ్ర వెంకటవీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎస్‌కే.కమ్లి, సయ్యద్ రవూఫ్, ఎస్‌డీ.ఇషాక్, జానీ, ఉప్పు నరసింహారావు, సాలేహా పాల్గొన్నారు. ఇక కల్లూరుకు చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవర్లు సండ్ర వెంకటవీరయ్యకు మద్దతు ప్రకటించగా పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు. తల్లాడ మండలం బాలపేటలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు సండ్ర సమక్షాన బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో చిట్టి నరసింహారావు, చిట్టెం రామారావు, తోట రాంబాబు ఉండగా, ఎంపీపీ దొడ్డా శ్రీనువాసరావు, గజ్జెల మోహన్‌రావు, పడాల శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావు, నర్సింహారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీసీసీ క్యాంపెయిన్ కమిటీలోకి రంగారావు


కట్ల రంగారావు

వైరా: కాంగ్రెస్ క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్‌గా వైరాకు చెందిన కట్ల రంగారావు నియమితులయ్యారు. ఈమేరకు గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వైరాలో రంగారావు మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సత్యసాయి బోధనలు స్ఫూర్తిదాయకం


పూజలు చేస్తున్న భక్తులు

మధిర: పుట్టపర్తి సత్యసాయిబాబా బోధనలు మానవ జీవితానికే స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కౌన్సిలర్ మల్లాది వాసు అన్నారు. పట్టణంలో గురువారం సత్యసాయి జయంతి వేడుకలు గురువారం నిర్వహించగా సత్యసాయి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. అలాగే, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వాసు మాట్లాడుతూ సత్యసాయి బాబా అందించిన సేవలను వివరించారు. సేవా సమితి బాధ్యులు కోనా మోహన్‌రావు, మురళీకృష్ణ, చిదిరాల సత్యనారాయణ, కోట చక్రధరరావు, చేడే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న రఘు

కల్లూరు: కల్లూరు మేజర్ గ్రామపంచాయితీ పరిధి అంబేద్కర్‌నగర్‌కు చెందిన వాడపల్లి జోజి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈమేరకు రైతుబంధు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందచేశారు. ఈకార్యక్రమంలో ఎల క్రీష్టియన్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

మధిర: మండలంలోని ఇల్లెందులపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చేకూరి కిషోర్‌బాబు ఇటీవల మృతి చెందారు. ఈమేరకు గురువారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు హాజరై కిషోర్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మల్లాది హన్మంతరావు తదితరులు కూడా పాల్గొన్నారు.

భట్టితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం


మధిర : కరపత్రాలు అందజేస్తున్న మల్లు నందిని విక్రమార్క


ఎర్రుపాలెం : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

ప్రచారంలో మల్లు నందిని

మధిర: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గెలవడం , రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ద్వారా అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని ఆయన సతీమణి మల్లు నందిని తెలిపారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నందిని మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో సమస్యలతో పాటు రేషన్‌కార్డులు, ఇళ్లు మంజూరు కాలేదని స్థానికులు ఆమెకు తెలిపారు. దీంతో నందిని స్పందిస్తూ త్వరలోనే కాంగ్రెస్ ఆధ్వర్యాన ప్రజాప్రభుత్వం.. ఆవెంటనే ప్రజల సమస్యల పరిష్కారానికి భట్టి విక్రమార్క కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సువర్ణకంటి రామకృష్ణ, మొండితోక సుధాకర్, కోనా సుచరిత పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కను గెలిపించాలి

ముదిగొండ: మధిర నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్కను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు లోకేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ముదిగొండలో మాజీ జెడ్పీటీసీ బాబు నివాసంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిపై శ్రద్ధ ఉన్న భట్టి విక్రమార్కను మూడు సార్లు గెలిపించిన ప్రజలు మరోమారు అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదరుశలు కొమ్మినేని రమేష్‌బాబు, తాటికొండ రమేష్‌తో పాటు ఆదినారాయణరెడ్డి, మందరపు నాగేశ్వరరావు, కందిమళ్ల వీరబాబు, మట్టా బాబురాంరెడ్డి, ధర్మానాయక్, పందిరి అంజయ్య పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలంలో...

ఎర్రుపాలెం: మధిర ఎమ్మెల్యేగా మల్లు భట్టి విక్రమార్కను మరోమారు గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించారు. భట్టి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని వివరిస్తూ ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మల్లెల లక్ష్మణరావు, కడియం శ్రీనివాసరావు, ఆకుల నాగేశ్వరరావు, శివ, నారాయణ, నర్సిరెడ్డి, శంకర్, వాసు, బాబురావు, జనార్దన్, షాబాష్, పాల్గొన్నారు. కాగా, మల్లు భట్టి విక్రమార్కకు మద్దతు ప్రకటించినట్లు వైస్సార్ టీపీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు భట్టి విజయానికి గాను ప్రచారంలో పాల్గొంటామని వెల్లడించారు.

స్వరాష్ట్రంలో నిరుద్యోగులకు తిప్పలు


యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కొణిజర్ల: తెలంగాణ ఏర్పడితే బతుకులు బాగు పడతాయని భావిస్తే కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు ఇక్కట్లే తప్ప ఫలితం అందలేదని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ఇన్‌చార్జి ఇంద్ర నాయక్, ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ ఎల్‌డీఎం కన్వీనర్ సూరంపల్లి రామారావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యాన చేపట్టిన చైతన్యయాత్ర (బస్సు యాత్ర) గురువారం సాయంత్రం కొణిజర్ల చేరుకుంది. ఈసందర్భంగా సూరంపల్లి ఆధ్వర్యాన స్వాగతం పలికాక మాట్లాడారు. ఓటు ద్వారానే కేసీఆర్ ప్రభుత్వానికి యువత గుణపాఠం చెప్పాలని కోరారు. ఈకార్యక్రమంలో మహేష్, చంద్రరావు, అంజి, మురళి, ముత్తారావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి కుట్టుమిషన్


కుట్టుమిషన్ అందజేస్తున్న స్నేహితులు

సత్తుపల్లి: ఓ మహిళ కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.30వేల విలువైన కుట్టుమిషన్‌ను ఆమె స్నేహితులు గురువారం అందించారు. సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా సత్తుపల్లికి చెందిన అలివేలు ఎలాంటి ఆధారం లేక జీవనోపాధి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు స్నేహితులు గుర్తించారు. దీంతో ఆమెకు పూర్వ విద్యార్థులు ఎండీ.సబానా, మాధురి, నీరజ, జయశ్రీ, వాణి, రమాదేవి, పల్లవి తదితరులు కుట్టుమిషన్ అందజేశారు.

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం'



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్

మధిర: రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని తెలంగాణ డాక్టరేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి జీవన్ విమర్శించారు. మధిరలోని బోడెపుడి భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పలు సంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన ఉద్యమాల్లో ఆయన శక్తివంచన లేకుండా పనిచేశారని చెప్పారు. అసెంబ్లీలో అణగారిన ప్రజల గొంతుక వినిపించాలనే భావనతో భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. కాగా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పిన కేసీఆర్ ఆతర్వాత హామీని విస్మరించారని ఆరోపించారు. ఓయూ జేఏసీ నాయకులు యాదగిరి, ఉపేందర్‌నాయక్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, తేలప్రోలు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


అవగాహన సదస్సులో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చింతకాని: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని పలువురు సూచించారు. మండలంలోని నాగులవంచ శ్రీ ఆదర్శ హైస్కూల్‌లో గురువారం ఓటు హక్కు వినియోగం, ఆవశ్యకతపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని తెలిపారు. ఈనెల 30న ఓటు వేసేలా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ బోడెపూడి కిరణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి తలారి జయశ్రీ, ఉపాధ్యాయులు అమరబోయిన సురేష్, బోళ్ల రేణుక, పార్వతి, త్రివేణి, శ్రీనివాస్, జ్యోతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

బంజరలో ఆయుర్వేద వైద్యశిబిరం


స్థానికులను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటలాల్

ఎర్రుపాలెం: మండలంలోని బంజర గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ బి.రంగా ప్రారంభించగా, స్థానికులను డాక్టర్ వెంకట్‌లాల్ పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బనిగండ్లపాడు పీహెచ్‌సీలో ప్రతిరోజు ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ దండెం సాయిరెడ్డి, ఏఎన్ఎం రత్నమాల, ఫార్మసిస్టు శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



జస్వంత్‌కు కేక్ తినిపిస్తున్న లయన్స్ బాధ్యులు

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలో పూర్ణకంటి దాసు కుమారుడు జస్వంత్ పుట్టినరోజు సందర్భంగా గురువారం అన్నదానం ఏర్పాటుచేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన కేక్ పంపిణీ చేశాక అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు పెనుగొండ ఉపేంద్రరావు, చింతోజు నాగేశ్వరరావు, రాయపూడి నారాయణ, కట్ల సురేష్, పూర్ణకంటి కృష్ణ, జమలమ్మ, వృద్ధాశ్రమ నిర్వాహకులు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం


రాజేష్

కల్లూరు రూరల్: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన బరిగెల రాజేష్ కాంస్య పతకం సాధించాడు. ఆయన 220 కేజీల బరువు ఎత్తి తృతీయ స్థానంలో నిలవగా కాంస్య పతకం లభించింది. ఈ సందర్భంగా రాజేష్‌ను పలువురు అభినందించారు.

దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లు

కల్లూరు రూరల్: మండలంలోని చిన్నకోరుకొండిలో దివ్యాంగులకు 50 శాతం రాయితీపై బస్‌పాస్‌లను గురువారం పంపిణీ చేశారు. మధిర సబ్‌జైల్ కానిస్టేబుల్ బొడ్డు నర్సింహారావు – సుధ దంపతుల కుమార్తె చేతన పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు పాస్‌లు పంపిణీ చేశారు. వీటి ద్వారా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో రాయితీతో ప్రయాణించవచ్చని సత్తుపల్లి ఆర్టీసీ డిపో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు తెలిపారు. చిన్నకోరుకొండి సర్పంచ్ నామా రాధమ్మతో పాటు కంచి సాంసన్, నామా వెంకటేశ్వర్లు, సంగెపు నారాయణ, వెంకటేశ్వర్లు, ముల్లంగి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారం

వైరారూరల్: పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుషోల్లో పాల్గొంటుండడమే కాక ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు వైరా కాంగ్రెస్ అభ్యర్థి మాలోతు రాందాస్‌నాయక్ మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొని తనను గెలిపించాలని కోరారు. నాయకులుబొర్రా రాజశేఖర్, మచ్చా వెంకటేశ్వర్లు, శీలం వెంకటనర్సిరెడ్డి, పాదిలి హరినాథ్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకులు..

కొణిజర్ల: వైరా సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, పారుపల్లి ఝాన్సీ, కొప్పుల కృష్ణయ్య, అన్నారపు వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి విజయ, విజయ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని..

పెనుబల్లి: బీజేపీ సత్తుపల్లి అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు పెనుబల్లి మండలం కొండ్రుపాడు, పాతకారాయిగూడెం, కొత్త కారాయిగూడెం గ్రామాల్లో ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు, నాయకులు పడిగల మదుసూదన్‌రావు, ఓరుగంటి రాము, కనగాల వెంకట్రామయ్య, భాస్కర్‌ని వీరం రాజు, బానోతు రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడలో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని పార్టీ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు గురువారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో నంబూరి రామలింగేశ్వర్‌రావును గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో నాయకులు గాదె కృష్ణారావు, రాయల రమేష్, తెనాలి దినేష్, చౌడా నాగేశ్వర్‌రావు, ఎల్లంకి సుధాకర్, నంబూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మట్టా రాగమయి ప్రచారం..

పెనుబల్లి: చేయి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతూ సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి ప్రచారం చేశారు. పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేయగా కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ప్రజలంతా హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామాల్లో ప్రజలు స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. వజ్రాయుధం



'ఓట్ ఫర్ స్యూర్' అక్షరాల ఆకృతిలో విద్యార్థులు

ఏన్కూరు: ఓటుహక్కు వజ్రాయుధమని.. అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ బాదావత్ రవి సూచించారు. మండలంలోని తూతకలింగన్నపేట గుడ్‌న్యూస్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పిరమిడ్ ఆకృతిలో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం పాఠశాల నుండి ఏన్కూరు ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఆటపాటలతో ప్రజలకు ఓటు హక్కుపై చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి మాట్లాడగా ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ బ్రిటో, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.